క్లుప్తంగా

అట్టహాసంగా దుర్యోధన వధ



దుర్యోధనుడు, భీమసేనుడి యుద్ధ సన్నివేశం

ఐరాల: మండలంలోని మద్దిపట్లపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారితోపాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి మట్టి ప్రతిమ చూపరులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారులు యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. దుర్యోధునుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అనంతరం భీముని వేషధారి దుర్యోధనుడిని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ

గుడిపాల : మండలంలో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నారగల్లులో ముత్యాలమ్మ దేవాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 11 గంటలకు 197 రామాపురం చర్చ్ వద్ద, సాయంత్రం 4 గంటలకు బొమ్మసముద్రం బస్టాప్ వద్ద, 5 గంటలకు నంగమంగళం గ్రామంలో జరుగుతుందన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు. అధికారులు తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. రానివారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని వివరించారు.

నేడు ఓట్ల చోరీకి నిరసనగా క్యాండిల్ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : ఓట్ల చోరీకి నిరసనగా సోమవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నగర అధ్యక్షుడు టిక్కీ రాయల్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఓట్ల చోరీతో గద్దెనెక్కిన ప్రజాప్రతినిధులు గద్దె దిగిపోవాలన్నారు. అమాయకపు ప్రజలను మోసం చేసి దొంగ ఓట్లను సృష్టించారని విమర్శించారు. ఇందుకు నిరసనగా సోమవారం సాయంత్రం 6 గంటలకు తమ పార్టీ ఆధ్వర్యంలో చిత్తూరులోని గాంధీ బొమ్మ వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

47 మందికి రూ.52 వేల జరిమానా

చిత్తూరు అర్బన్: ప్రమాదకరంగా వాహనాలు నడిపిన 47 మందికి పోలీసులు జరిమానా విధించారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర ఆదివారం తన సిబ్బందితో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల అత్యంత వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ పాదచారులను ఇబ్బందులకు గురిచేసిన వారిని గుర్తించారు. ఇలా 47 మందిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రూ.52 వేల జరిమానా వసూలు చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పెద్ద బాలశిక్షతో విజ్ఞానం

పలమనేరు: పెద్దబాలశిక్ష చదవడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు కొంతసేపైనా పెద్ద బాలశిక్ష పుస్తకాన్ని చదవాలన్నారు. ఇందులో అనేక విషయాలు వున్నాయని తెలపారు.

సేవలకు మంగళం..!

- తెరుచుకోని ప్రభుత్వ సైట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- విలవిల్లాడుతున్న పేద ప్రజలు



కుప్పిగానిపల్లె సచివాలయం

గుడిపాల: చిత్తూరు నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కింద 12 వేల మందికి ఉచిత వైద్య సేవల కింద రూ.85 కోట్లు చేశారు. వైఎస్సార్ ఆరోగ్య బీమా కింద 600 మందికి రూ.8.73 కోట్లు వ్యయం చేశారు. ఈ ప్రభుత్వంలో వాటితో పాటు ఇతర పథకాల జోలికి వెళ్లడం లేదు. 2024లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం తాత్కాలికంగా ప్రభుత్వ సైట్లను మూసివేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ప్రభుత్వ సైట్‌లను తెరవడం లేదు. సైట్‌లు తెరవకపోవడంతో వివిధ పథకాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వ సైట్లు తెరవకపోవడంతో వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అమలులోకి తెచ్చి దాదాపు 534 సేవలను సచివాలయాల ద్వారా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను పక్కన పెట్టింది. ఎన్నికల హామీలో భాగంగా గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను విధుల నుంచి తప్పించింది. వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ సేవల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సైట్లు మూసివేసే సమయానికి పింఛన్ల కోసం చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లభించకపోగా.. కొత్తవాటికి అవకాశం లేకుండాపోయింది. రేషన్ కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. గత ప్రభుత్వంలో సాధారణంగా చనిపోతే వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదమైతే రూ.10 లక్షల చొప్పున సాయం అందిస్తామన్న చెప్పింది. వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయకపోవడం వల్ల బాధితులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పరిస్థితి అలాగే ఉందని, సైట్‌లోని పలు ఆప్షన్లు పనిచేయడం లేదని వాపోతున్నారు. పెళ్లికానుక విషయంలోను ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవడానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించేది. బీసీ కులాలకు రూ.50 వేలు, వధువరుల్లో ఎవరైనా వికలాంగులు ఉంటే వారికి రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గానికి రూ.లక్ష, వారిలో ఒకరు వికలాంగులైతే రూ.1.5 లక్షలు, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల్లో కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రెండింతలు చేస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలేసింది.

ప్రభుత్వ సైట్లను తెరవాలి



ఎన్నికలకు ముందు మూసివేసిన పలు ప్రభుత్వ సైట్లను తెరవాలి. సైట్లను మూసివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి సైట్ పనిచేయడం లేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు.

– కలైఅరసి, వెస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు, గుడిపాల

ఉత్తర్వులు రావాలి



వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే వాటి అమలును వేగవంతం చేస్తాం. దరఖాస్తులు చేసుకునే అర్హులైన వారందరికి లబ్ధి కలిగించేలా చర్యలు తీసుకుంటాం. పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేస్తాం.

– శిరీషా, ఎంపీడీవో, గుడిపాల

ప్రభుత్వ డ్రైవర్లకు సత్కారం



పన్నీర్ సెల్వంను సత్కరిస్తున్న సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డ్రైవర్ల సేవలు ఎనలేనివని ఏపీ సెంట్రల్ డ్రైవర్స్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు పన్నీర్ సెల్వం తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్న డ్రైవర్లను ఆదివారం చిత్తూరులోని ఆ సంఘం కార్యాలయంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డ్రైవర్లు సంవత్సరాల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం పలు శాఖల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న డ్రైవర్లకు జీతాలు పెంచి రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం ఇటీవల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులైన పన్నీర్‌సెల్వంను, ఉత్తమ అవార్డులు అందుకున్న జేసీ పేషీ డ్రైవర్లు ప్రకాష్, రూప్ కుమార్, ఇటీవల ఉద్యోగ విరమణ చేసి హౌసింగ్ శాఖ డ్రైవర్ జయరాంను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు హరిబాబు, షణ్ముఖ, రామన్న, బాబు, రవికుమార్, దేవా, వినాయక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మాటంటే.. అమలు గ్యారెంటీ

- చంద్రబాబు హామీ ఇస్తే.. మోసం గ్యారెంటీ
- వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



క్యూఆర్‌కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే హామీలు కచ్చితంగా అమలవుతాయని, చంద్రబాబు హామీ ఇస్తే మోసం గ్యారెంటీ అని తేలిపోయిందని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక 10వ డివిజన్ సత్యనారాయణపురంలో బాబురెడ్డి, రూపేష్‌రెడ్డి, 9వ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, జగన్, శ్యామ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పూర్తి స్థాయిలో అమలు చేశారా? ఎంత లబ్ధి కలిగింది అని స్థానికులను అడిగారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలను ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో వెనుకాడుతున్నారని పేర్కొన్నారు. హామీల గురించి అడిగితే సింగపూర్ కంపెనీలు వస్తున్నాయని, రూ.45 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. మరో పక్క మాజీ ముఖ్యమంత్రి జగనన్న పర్యటనలకు వచ్చినప్పుడు కూటమి నాయకులు ప్రజలను రానీయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఒక నాయకుడి వద్దకు ప్రజలు, అభిమానులను వెళ్లనీయకుండా రోడ్లు తవ్వేయడం, బారికేడ్లు, ముళ్లకంచెలు పెట్టడం దేశ చరిత్రలోనే లేదన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, పార్టీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి లీనారెడ్డి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, మధురెడ్డి, చల్లాముత్తు, లక్ష్మణస్వామి, మనోజ్‌రెడ్డి, హరిషారెడ్డి, దేవరాజులు, వెంకటేష్, రాజేష్‌రెడ్డి, మురళీరెడ్డి, గోపిరెడ్డి, బాల, మునస్వామిరెడ్డి, బాలాజీ, బాబీ, బాలకృష్ణారెడ్డి, మణి, సుబ్రమణ్యం, రాజ్, రమేష్, బాబు, జస్టిన్, సుధా, ప్రేమ్, కుమార్, రేవతి, శశికళ, అరుణ్, శరవణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న స్థానికులు

హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల సీపీఐ జిల్లా మహాసభల్లో చేసిన తీర్మానాలను ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శులు జనార్ధన్, శివారెడ్డి డిమాండ్ చేశారు. వారు ఆదివారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హంద్రీ- నీవా ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించాలన్నారు. గాలేరు – నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు సరఫరా చేయాలన్నారు. చిత్తూరులో కేంద్రీయ విద్యాలయాలు, యూనివర్సిటీ, వ్యవసాయ, పశువైద్యం, పాలిటెక్నిక్, ప్రభుత్వ కళాశాలలు ప్రారంభించాలన్నారు. అలాగే చిత్తూరులో చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.12 మద్దతు ధర ఇవ్వాలన్నారు. నగరిలో అక్రమ క్వారీల లైసెన్సులను రద్దు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. పుంగనూరులో చింతపండు పరిశ్రమను ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. నగరిలో రసాయన కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. టమాటా రైతులకు మద్దతు ధర ప్రభుత్వం కల్పించాలని, చిత్తూరులో రోడ్లను విస్తరించి ట్రాఫిక్ సిగ్నల్‌ను అమలులోకి తేవాలన్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు నుంచి చెన్నైకు రైలు నడిపేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మణి, బాలాజీ పాల్గొన్నారు.

పచ్చి అబద్ధాలతో మోసం చేశారు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

- సూపర్ సిక్స్ అంతా డమ్మీ
- తాళంబేడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో ఆదివారం సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు సంపత్, సుధీర్‌రెడ్డి, ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో హామీలిచ్చిందన్నారు. ఆ హామీలన్ని డమ్మీలవుతున్నాయన్నారు. తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పారని మండి పడ్డారు. సూపర్‌సిక్స్ హామీలను డమ్మీ చేశారని దుయ్యబట్టారన్నారు. ఉచిత బస్సు అని మహిళలను మోసం చేస్తున్నారన్నారు. దివ్యాంగుల పింఛన్లలో కోతలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కారణంగా చాలా మంది అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ మోసాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు, నాయకులు వేలుస్వామి, స్టాండీ, నాగేంద్ర, ఆబేల్, భాస్కర్, జేజిరెడ్డి, రవినాయుడు, భాస్కర్‌నాయుడు, దిలీప్, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురం, సరకల్లులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతుందని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు హాజరై వైద్య బృందానికి సహకరించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తెలిపారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



చిత్తూరులో వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

చిత్తూరు రూరల్: ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం చిత్తూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గంగనపల్లె కూడలిలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అభాగ్యులు, వృద్ధులకు అన్నదానం చేశారు. అదేవిధంగా తపోవనంలో వృద్ధులు, బుద్ధిమాంద్యం పిల్లలకు రొట్టెలు పంపిణీ చేశారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనలో ఏపీయూడబ్ల్యూజేకు ప్రత్యామ్నాయం లేదని జిల్లా అధ్యక్షులు లోకనాథన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి రమేష్ బాబు, కాశీశ్వరరెడ్డి, పాత్రికేయులు అశోక్‌కుమార్, పవన్, రాజేష్, కృష్ణసింగ్, చంద్ర, నిరాశ్రయుల కేంద్రం నిర్వాహకులు జోసెఫ్‌రాజు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి ఊరేగింపు



సదుంలో ఊరేగుతున్న సుబ్రమణ్య స్వామి

సదుం: మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి నీరాజనాలు పలికి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రవీంద్ర రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెదరింపులకు బెదరం

- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ పచ్చ స్కెచ్
- ఎంపీకి బెయిల్ రావాలని ధర్మారాజుల గుడిలో పూజలు



కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం బెదరింపులకు బెదరమని, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ పచ్చ పార్టీ స్కెచ్ అని జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంపత్, సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలం తాళంబేడులోని శ్రీధర్మరాజుల ఆలయంలో ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్య ప్రజలను భయపెడుతోందన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి చేయిస్తోందన్నారు. రెడ్‌బుక్ పేరుతో తప్పుడు కేసులు పెడుతోందన్నారు. ఈ బెదిరింపులకు వైఎస్సార్ సీపీ ఎప్పటికీ బెదరదన్నారు. ఈ తప్పుడు కేసులన్నింటికీ కచ్చితంగా కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

అపూర్వ సమ్మేళనం



సమావేశం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం (1999–2000) పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. వారు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు సుధాకర్, సరోజినిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవి, జయప్రభు, గోపికృష్ణ, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



పశుసంరక్షణ కిట్లతో శ్రీజ డెయిరీ సభ్యులు

వి.కోట: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా శ్రీజ డెయిరీ పనిచేస్తోందని డెయిరీ ఏరియా పీఏబీ ఎగ్జిక్యూటివ్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని పత్రపల్లి కొత్తూరు గ్రామంలోని డెయిరీ సభ్యులకు ఆదివారం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పశుసంరక్షణ కిట్లు, పశుగ్రాసం కోసం సీడ్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీజ డెయిరీలో పాలు పోసే సభ్యుల నుంచి బోర్డు డైరెక్టర్ వరకు అందరూ మహిళలే ఉన్నారని తెలిపారు. ఈ డెయిరీ పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. శ్రీజ మహిళ పాల యజమానులకు వాళ్ల అర్హతను బట్టి 2024–25లో బోనస్‌గా లీటర్‌కు 60 పైసలు ఇస్తున్నట్లు తెలిపారు. డెయిరీ ఏరియా సూపర్‌వైజర్స్ నాగరాజ్, కిషోర్‌రెడ్డి, పాలమిత్ర నారాయణ స్వామి పాల్గొన్నారు.

ముగిసిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా చివరి రోజున భక్తులు స్వామి వారికి బాల కావళ్లు చెల్లించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయంలో కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. తదుపరి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పెద్ద గొల్లపల్లె గ్రామంలో ఊరేగించారు.



ఆలయంలో బాల కావళ్లతో భక్తులు